క్లుప్తంగా

నేటి నుంచి ముక్కిడి పోలమ్మ జాతర



ముక్కిడి పోలమ్మతల్లి

సీతంపేట: మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలో కొలువుదీరిన ముక్కిడి పోలమ్మ జాతర ఆదివారం నుంచి ఐదురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తూరు, హిరమండలం, సీతంపేట, పాతపట్నం, దోనుబాయి పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకోనున్నారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలంలోని పెందకంలాం గ్రామంలో రామాలయ ప్రారంభోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పురోహితులు వేదుల పార్థసారథి ఆధ్వర్యంలో యజ్ఞకర్త ఆరవెల్లి విజయకుమారశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సూచించారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాదచారులు, వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వేగంగా వాహనాలతో వెళ్లకూడదని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించకూడదని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారంతా సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి

సీతానగరం: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన ఆయన భూముల రీసర్వేపై సమీక్షించారు. పక్కాగా సర్వే చేపట్టి, ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలను పరిష్కరించాలని తహసీల్దార్ సూచించారు. రైతులు కూడా సర్వే జరిగేటప్పుడు పొలాల వద్ద ఉండాలని, ఏవైనా తప్పులు వస్తే వెంటనే అధికారులను సంప్రదించి, సరిదిద్దుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రానుందని తెలిపారు. వీటిపై వీఆర్‌ఓలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ చిట్టెమ్మ, ఆర్ఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జిలపై పోలీసులు శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా వచ్చే వాహనదారులు ఆపి, వారి వాహనాల సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, సీ–బుక్‌లు, పొల్యూషన్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. లచ్చయ్యపేట, జోగింపేట, మరిపివలస జంక్షన్లలో రోజుకోసారైనా వాహన తనిఖీలు చేస్తుండడం గమనార్హం.

ఉపాధి వేతనదారుల సంఖ్య పెరగాలి

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆమె పరిశీలించారు. వేతనదారులకు గరిష్ఠ వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని, మస్తర్లను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వేతనదారులు రెండు పూటలా పనుల్లో పాల్గొనాలన్నారు. ఆమె వెంట ఏపీఓ టి.రామకృష్ణనాయుడు ఉన్నారు.



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పైడితల్లి

రోజుకు 4వేల మందికి పని

కొమరాడ: మండలంలోని 31 పంచాయతీల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని దుగ్గి గ్రామంలో జరుగుతున్న పనులను ఏపీఓ బి.బాలకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు నాలుగు వేల మంది వేతనదారులు పనులకు వస్తున్నారన్నారు. పని కావాల్సిన వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందించి జాబ్‌కార్డు పొందాలని సూచించారు.

వేతనదారులు సమయపాలన పాటించాలి

వీరఘట్టం: ఉపాధి పనులకు వచ్చే వేతనదారులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు నమోదు చేయాలని, బడిఈడు పిల్లలను పనిలోకి తీసుకోవద్దని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. కొలతల్లో తేడాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



కొమరాడ: దుగ్గిలో మస్తర్ల నమోదును పరిశీలిస్తున్న ఏపీఓ బాలకృష్ణ

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

కురుపాం: వైఎస్సార్‌సీపీ కురుపాం మండల సోషల్ మీడియా కన్వీనర్లను పార్టీ అధిష్ఠానం నియమించింది. మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎస్.నాగభూషణం, కో–కన్వీనర్లుగా రాయిపిల్లి శ్రీధర్, శిలావంశం సంతోష్‌కుమార్, ఆరిక రంగారావు, శెట్టి నాగరాజు, రాయిపిల్లి కార్తీక్‌లను నియమించారు.

గరుగుబిల్లి మండల కన్వీనర్‌గా వెంకటేష్

గరుగుబిల్లి: వైఎస్సార్‌సీపీ గరుగుబిల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా చందక వెంకటేష్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. కో–కన్వీనర్లుగా గంటేడ జనార్దననాయుడు, గంట వంశీ, కుప్పిలి బాబాజీ, వడ్డి మహేష్, గిరిజాల హరీష్‌కుమార్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీచేసింది.

సోషల్ మీడియా కన్వీనర్, కో–కన్వీనర్లుగా నియమితులైన యువకులకు పార్టీ మండల కన్వీనర్ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అభినందనలు తెలిపారు. పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు.

వీరఘట్టం: మండల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనరుగా వై.దినేష్, కో–కన్వీనర్లుగా గోల కీర్తి సాగర్, పక్కి కిరణ్, సఖినాన లక్ష్మణనాయుడు, గేదెల పవన్ కళ్యాణ్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

కొమరాడ: వైఎస్సార్‌సీపీ కొమరాడ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా బొత్స దొరబాబు నియమితులయ్యారు. కో–కన్వీనర్లుగా గులిపల్లి సుధకరరావు, ద్వారపల్లి భార్గవ్, రాగల సంతోష్‌కుమార్, ఆకుల రాజేష్‌లను నియమించినట్లు పార్టీ కేంద్రం కార్యాలయం తెలిపింది.

అంతరపంటలతో అదనపు ఆదాయం

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం, బిత్రపాడు, సుభద్రమ్మవలస, వెంకటరాజపురం, చినబుడ్డిడి, పెదబుడ్డిడి తదితర గ్రామాల్లో రైతులు అంతరపంటల సాగుతో అదనపు ఆదాయం పొందుతున్నారు. పామాయిల్ సాగులో అరటి, అరటిలో ఉల్లి, కర్బూజా తదితర పంటలను అంతరపంటలుగా సాగుచేస్తున్నారు. ఇందులో ఒకటి దీర్ఘకాలికం, రెండోది స్వల్పకాలిక పంటను వేసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. ఏక కాలంలో రెండు రకాల పంటలు సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడి బాగుడడంతో ఆదాయం రెట్టింపు అవుతుంది. వ్యవసాయ అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే మరింతమంది రైతులు అంతర పంటల సాగుకు ముందుకు వచ్చేందుకు అవకాశం ఉంది.



సింగనాపురం వద్ద అంతరపంటగా అరటిసాగు

లోక్‌అదాలత్‌లో 518 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: చిన్నచిన్న తగాదాలతో కేసుల్లో ఇరుక్కొని, కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ సూచించారు. కేసుల నుంచి సత్వర ఉపశమనం పొందేందుకు రాజీమార్గమే శ్రేయస్కరమన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీకి అవకాశం ఉన్న 518 కేసులను పరిష్కరించామని, రూ.14,89,612లు అపరాధ రుసుం వసూలైందని న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ వి.విజయలక్ష్మి, ఏజీపీ చందక జగదీష్‌కుమార్, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీడిరైతుల ఆందోళన

గుమ్మలక్ష్మీపురం: గత కొన్ని రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో జీడిపంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో రైతులు వరి తర్వాత అధికంగా జీడిమామిడి సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పులు, పొగమంచు కారణంగా పూత, పిందె రాలిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. గత రెండేళ్ల మాదిరిగా ఈ ఏడాది కూడా నష్టాలు తప్పవేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తాడికొండ సమీపంలోని జీడిమామిడి తోట

విశాఖకు చెత్త తరలింపు

పాలకొండ రూరల్: పట్టణంలో కొత్తవీధి సమీపంలో ఉన్న తాత్కాలిక డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పందించారు. విశాఖ జిందాల్ సంస్థతో వారు మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. శనివారం ప్రత్యేక వాహనాల ద్వారా చెత్తను విశాఖలో ఏర్పాటు చేసిన రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించే ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ విక్రాంత్ దగ్గరుండి ఈ వాహనాలను విశాఖకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజాం డంపింగ్‌యార్డుకు మరికొంత చెత్తను తరలించి రీసైక్లింగ్ చేయిస్తామన్నారు. త్వరలో డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నగర పాలకవర్గ సభ్యులు దుప్పాడ పాపినాయుడు, పల్లా భాను, కొంచాడ అరుణ్‌కుమార్, తూముల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరాడ సూర్యనారాయణబాబు, పావలస దవళేశ్వరరావు, కె.రవికుమార్, యందవ మరియదాసు తదితరులున్నారు.



డంపింగ్‌యార్డు నుంచి చెత్త తరలింపును పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

ఎమ్మెల్సీ పరామర్శ



నానిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: మండలంలోని మంగళాపురం ఎంపీటీసీ కరణం నానిబాబును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. నానిబాబు తల్లి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విక్రాంత్ శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్వతమ్మ మృతికి సంతాపం తెలియజేశారు. విక్రాంత్‌తో పాటు పాలవలస దవళేశ్వరరావు, కరణం బాజ్జి ఉన్నారు.

18న కోటిపల్లి జాతర

పాలకొండ రూరల్: మండలంలోని కోటిపల్లి కొండపై వెలసిన ఉమా కాత్యాయనీ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ సింగవలప మంగామణి తెలిపారు. శనివారం గ్రామస్తులతో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. మూడు రోజుల పాటు ఘనంగా ఉత్సవాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారు.

సిరులు కురిపిస్తున్న మునగ

కొమరాడ: మునగ పంట గిరిజన రైతులకు సిరులు కురిపిస్తోంది. గిరిజన గ్రామాల్లో రైతులు పెరటితోటల పెంపకంలో భాగంగా మునగ చెట్లు పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. మండలంలోని పూడేసు, మసిమండ, లంజ, పెదశాఖ, చినశాఖ, కూనేరు తదితర అధికంగా మునగ చెట్లు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మునగకాడలకు మంచి గిరాకీ ఉంది. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి గిరిజన రైతుల వద్ద కిలో రూ.20 నుంచి రూ.30లు చొప్పున కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి లాభాలు పొందుతున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు పంట దిగుబడి ఉంటుంది. మునగ కాడలతో పాటు ఆకూలు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇందులో ఐరన్, కాల్షియం, తదితర మూలకాలు సమృద్ధిగా ఉంటాయి. దీంతో మునగ పంటకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది.

రగ్గుల పంపిణీ



వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

మక్కువ: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రగ్గుల పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సీఆర్‌పీఎఫ్–డి బెటాలియన్ తరపున పనసభద్ర, చప్పబుచ్చమ్మపేట పంచాయతీల పరిధిలోని దాదాపు 150 మంది వృద్ధులకు రగ్గులు అందజేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ తులసీ సింఘ్ మాట్లాడుతూ స్థానిక పోలీసుల సహకారంతో ఎప్పటికప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గిరిజన యువతీ, యువకులు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన క్రీడాపరికరాలు కూడా అందిస్తున్నామన్నారు. అలాగే గిరిశిఖర గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, వారి మెరుగైన ఆరోగ్యానికి సహకరిస్తున్నామన్నారు. ఇదంతా జవానులంటే గిరిజనులకు ఉండే భయం తొలగించి, వారి మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

గరుగుబిల్లి

మండల కేంద్రంలోని బీసీ వసతి గృహానికి పూర్తిస్థాయిలో వార్డెన్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం వసతిగృహాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహం రికార్డుల్లో 65మంది విద్యార్థులు ఉన్నప్పటికీ 40 మందికే వంట చేస్తున్నారని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, రన్నింగ్ వాటర్ ట్యాప్‌లు పాడైనా పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు, కుక్కలు హాస్టల్ ఆవరణంలోకి వస్తున్నాయని, పరిసరాలు అపరిశుభ్రంగా తయారవడంతో దుర్గంధం వెదజల్లుతోందని, వంటమనిషి, వాచ్‌మెన్ లేనందున స్వీపర్లే వంటలు చేస్తున్నట్లు గుర్తించారు. గరుగుబిల్లి, చినమేరంగి, కురుపాం, జియ్యమ్మవలసలోని వసతిగృహాలకు ఒకే వార్డెన్ ఇన్‌చార్జ్‌గా ఉండడంతో ఇక్కడి సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

జియ్యమ్మవలస: రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలును నిలిపివేయడంతో కళ్లాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

ప్రశాంతంగా హిందీ ప్రచారసభ పరీక్షలు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి హైదరాబాద్ వారి హిందీ ప్రచార సభ పరీక్షలు ప్రారంభమైనట్లు కేంద్రం వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ పండా తెలిపారు. విశారద, భూషణ్, విద్వాన్ పరీక్షలకు 49 మందికి గాను 46 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణను చీఫ్ సూపరింటెండెంట్ తోట శంకరరావు, డిపార్ట్‌మెంట్ అధికారి ఎన్.సత్యనారాయణ పర్యవేక్షించారు.

● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్ (పీటీజీ)లో శనివారం హిందీ ప్రచారసభ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 30 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు బి.మాధవరావు తెలిపారు. ఆదివారం కూడా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పరీక్ష కేంద్రం చీఫ్ కమలకుమారి తెలిపారు.



హిందీ ప్రచారసభ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

సీతంపేట: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని దిశ ఎస్సై బి.రేవతి అన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా సీతంపేటలో పలు దుకాణాలు, పెట్రోల్ బంకులు, వాహన మరమ్మతు షెడ్‌లలో శనివారం తనిఖీలు చేపట్టారు. 14 ఏళ్ల లోపు బాలబాలికలను పనిలో పెట్టుకోవద్దని, వారితో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఎస్ఐ నీలకంఠం, చైల్డ్‌లైన్ ప్రతినిధి ఎం.కృష్ణారావు, దిశ పోలీస్ మంజూ తదితరులు ఉన్నారు.



దుకాణ యజమానులకు సూచనలిస్తున్న పోలీసులు

కుష్టు వ్యాధిపై అవగాహన



లుంబూరులో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

పాలకొండ: మండలంలోని లుంబూరు గ్రామంలో కుష్టువ్యాధి నివారణపై ఆరోగ్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్, ఉపసర్పంచ్ పడాల రామచంద్రరావు ఆధ్వర్యంలో గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. కుష్టువ్యాధి అంటు వ్యాధి కాదని, సరైన అవగాహన ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని అన్నారు. వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని సంపూర్ణంగా నయం చేయవచ్చన్నారు. హెచ్ఏ రామశేసు, ఏపీఎంఓ ప్రసాద్, పావని తదితరులు పాల్గొన్నారు.

భాషా వలంటీర్లను కొనసాగించాలని వినతి

సీతంపేట:

సీతంపేట ఐటీడీఏ పరిధిలో వివిధ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సవర భాషా వలంటీర్లను కొనసాగించాలని సవర భాషా వలంటీర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం సాలూరులో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొరను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందించామని, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారని అన్నారు. ఎస్ఎస్ఏ కెపాసిటీ బిల్డింగ్ నిధులు ఉన్నాయని, గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు వస్తే తీసుకుంటామని పీఓ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఆ నిధులను బోధనకు వినియోగించేటట్టు చూడాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ నాయకులు డొంబు, ఎస్.ఆనందరావు తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సవర భాషా వలంటీర్లు

రైతు బాంధవుడు సీఎం జగన్

భామిని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడని, అన్నదాత అవసరాలు తీర్చడంలో ముందున్నారని జేసీఎస్ మండల కోఆర్డినేటర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. రబీసాగు అవసరాల కోసం బాలేరు రైతుభరోసా కేంద్రానికి వచ్చిన 450 యూరియా బస్తాలను శనివారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రపరికరాలను రాయితీపై అందివ్వడం, పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు జ్యోతి, రైతుమిత్ర తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు ఎరువులు అందిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్, ఏఏ జ్యోతి

శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం



స్థల పరిశీలన చేస్తున్న రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్:

నగరపంచాయతీ పరిధి 5వ వార్డు వాసులను వేధిస్తున్న శ్మశానవాటిక స్థల సమస్యకు పరిష్కారం లభించింది. ఇటీవల స్థానికులతో పాటు వార్డు కౌన్సిలర్ వెలమల మన్మథరావు రెవెన్యూ అధికారులను కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య తదితరులు సమీప కొండాపురం గ్రామస్తులతో చర్చించారు. 5 సెంట్లు స్థలాన్ని 5వ వార్డు పరిధి గాయిత్రీనగర్ కాలనీవాసులకు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. శనివారం డిప్యూటీ తహసీల్దార్ నేతృత్వంలో సదరు స్థలాన్ని కాలనీవాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.